
## కథ

# చెల్లి కావాలి

- హోతా పద్మినీదేవి



బాలూకి మెళకువ వచ్చింది. వాడు కళ్ళు విప్పాడు. గదంతా చీకటిగా ఉంది. బాలూకి దాహంగా ఉంది. అంతకు మించి జడలు విరబోసుకున్న దెయ్యంలా చుట్టూ అలుముకొని ఉన్న చీకటిని చూస్తే భయంగా ఉంది.

వాడు ఆ చీకట్లోనే చేయి జాచి పక్కంతా తడిమాడు. రాత్రి తన పక్కనే పడుకున్న తల్లి ఇప్పుడు ప్రక్కన లేదు.

'అమ్మా!' గట్టిగా పిలిచాననుకున్నాడు వాడు. కాని, భయంతో, అంతకు మించిన జ్వరంతో వున్న వాడి స్వరంలో ఆ మాట హీనంగా ఎక్కడో నూతిలో నుంచి ధ్వనిస్తున్నట్టు వచ్చింది.

'అమ్మా!' మళ్ళీ పిలిచాడు. తల్లి పలుకలేదు. వాడు కుడివైపుకి తిరిగి, 'నాన్నా!' అని పిలుస్తూ తండ్రి కోసం చెయ్యి జాపాడు. తండ్రి లేడు!

బాలూకి భయంతో ఏడుపు వస్తోంది.

'అమ్మా!' పిలిచాడు. ఆక్రందనలా ఉందా పిలుపు. తల్లి అసలు ఆ గదిలోనే లేనట్టుంది.

వాడికి మంచం దిగి తల్లి దగ్గరకు వెళ్ళాలన్పించింది. కాని, భయంతో, జ్వరతీవ్రతతో నిస్సత్తువ కమ్ముకుంది. శరీరంలో ఏ ఒక్క అవయవమూ కదలడానికి సహకరించడం లేదు.

వాడికి ఏడుపు వస్తోంది. అసహాయంగా వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

కరెంటు వచ్చినట్టుంది. బెడ్‌లైటు వెలగడంతో పాటు పైన ఫ్యాన్ కూడా తిరగడం మొదలు పెట్టింది.

వాడు కన్నీటి పొరలలో నుంచి ఆ వెలుతురులో గది అంతా కళ్ళతోనే వెదికాడు. తన ఊహ నిజమే. గదిలో తల్లి లేదు!

జ్వరతీవ్రతలో ఉన్న తనని చీకటిలో ఒంటరిగా వదిలేసి ఎక్కడికి వెళ్ళింది అమ్మ! వాడికి దుఃఖంతో బాటు తల్లిపై కోపం కూడా సమపాళ్ళలో వచ్చింది. 'తను ఒంటరిని' అనే భావంతో వచ్చిన దుఃఖం అది.

నుదుటిపై చల్లని చేతి స్పర్శ! 'బాలూ' అనే ఆర్ద్రమైన పిలుపు.

'ఏడుస్తున్నావెందుకమ్మా?' ఆ చేతిని విసిరి కొట్టాలనిపించినా ఓపిక లేని బాలూ దుఃఖం రెట్టింపయింది.

'ఊరుకో నాన్నా! జ్వరం ఎక్కువయిపోతుంది! వా తండ్రిగా! వూరుకో!' గాద్గదికమైన స్వరంతో అంటూ వాడిని గుండెల్లోకి తీసుకుని ఓదార్చసాగింది మమత. కొద్దిసేపటి తరువాత దుఃఖోపశమనం కలిగి బాలూ కోపంగా అడిగాడు.

'నన్నిక్కడ ఒక్కడినీ వదిలేసి నువ్వెక్కడికి వెళ్ళావ్! నాకెంత భయం వేసిందో తెలుసా?'

మమత సమాధానం చెప్పలేదు. అప్పుడే ఆ గదిలోకి వచ్చిన సారథి కళ్ళతో ఆమె కళ్ళు క్షణకాలం కలుసుకున్నాయి.

చప్పున చూపు మరల్చుకుని బాలూ తల నిమురుతూ అంది.

'నేను నీ దగ్గరే పడుకుంటానుగా! ఇంకేమీ భయం లేదు. పడుకో!'

అమ్మ చేతుల మధ్య పడుకున్న బాలూ క్షణాలలో నిద్రలోకి జారుకున్నాడు.

బాలూకి చెరొకవైపు పడుకున్న మమతకి, సారథికి నిద్ర పట్టడం లేదు.

*******************

బాలూకి విసుగ్గా ఉంది. వాడు స్కూలుని వెళ్ళి రెండు నెలలయింది. రెండు నెలలుగా వాడికి తరచూ జ్వరం వస్తూనే ఉంది.

ఎందరో డాక్టర్లు.. రకరకాల మందులు.. అర్థం కాని పరీక్షలు... నీరసించిన దేహం... ఈ రెండు నెలల్లోను బాలూ చిక్కి శల్యమయ్యాడు.

ఓపిక ఉన్నప్పుడు పుస్తకాలు తీసి చదువుకోవడం, లేకపోతే పడుకోవడం, ఆ పడుకోవడం కూడా నిద్ర వచ్చి కాదు. నీరసం, నిస్సత్తువ వాడిని మంచం మీద నుంచి లేవనివ్వడం లేదు.

మహేష్, చక్రధర్, మురళి వీళ్ళందరిలా తను కూడా చదువుకోవాలి. ఈ పాటికి చాలా పాఠాలు చెప్పేసే ఉంటారు. క్వార్టర్లీ పరీక్షలు మొదలయ్యే ఉంటాయి. అయినా తనకీ పాడు జ్వరం తగ్గదేం? మంచి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళమని తండ్రితో చెప్పాలి.

'అమ్మా!' వాడు పిలిచాడు. ఉద్వేగంతో వాడి స్వరం కంపిస్తోంది. 'ఏమిటి బాలూ!' చేస్తున్న పని వదిలేసి పరుగెట్టి వచ్చింది మమత.

'ఏం కావాలి నాన్నా! ఆకలేస్తుందా?' సృష్టిలోని ప్రేమ, అనురాగం మూర్తీభవించిన ఆ స్వరం వింటూ తల్లి ముఖంలోకి తదేకంగా చూస్తున్నాడు వాడు.

పగలంతా అనుక్షణం తనని కనిపెట్టి వుండే తల్లి.. తనను కంటికి రెప్పలా కాచుకునే తల్లి ... రాత్రి తనని ఒంటరిగా వదిలి ఎక్కడికి వెళ్తుంది? తొమ్మిదేళ్ళ బాలుకి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

'ఏం కావాలమ్మా! ఏమీ తోచడం లేదు కదూ! పుస్తకం చదివి వినిపించనా?'

'నాకు స్కూలుకి వెళ్ళాలని ఉంది! చదువుకోవాలని ఉంది! క్వార్టర్లీ పరీక్షలు మొదలయ్యే ఉంటాయి. ఈసారి చక్రధర్‌కి ఫస్ట్‌మార్క్ వస్తుంది. నేను క్లాసులో ఉంటే వాడికి ఫస్ట్ మార్క్ ఎప్పుడూ రాదు!' ఆగకుండా గబగబ మాట్లాడేస్తున్న బాలూ క్షణం ఆగి వూపిరి పీల్చుకుని అన్నాడు.

"నాకీ పాడు జ్వరం తగ్గదేమమ్మా! నాన్నగారు రాగానే చెప్పు. నన్ను మంచి డాక్టరు దగ్గరకి తీసికెళ్ళమని.."

మమత బాలూ వైపు చూడకుండానే అంది 'అలాగేలే!'

ఆ రాత్రి బాలూ నిద్ర నటిస్తూ తల్లి తనని ఒంటరిగా వదిలేసి ఎక్కడకి వెళ్తుందా అని గమనిస్తున్నాడు.


ముందు బాలూకి కుడివైపు పడుకున్న సారథి లేచాడు. ఆ వెనుకనే మమత లేచింది. ఇద్దరూ ఎదురుగా ఉన్న మరో బెడ్‌రూమ్‌లోకి నడిచారు. వాళ్ళ వెనుకనే ఆ గది తలుపులు మూసుకుపోయాయి.

బాలూ వెడల్పయిన కళ్ళలో దుఃఖం, కోపం పోటీ పడుతుండగా మూతబడిన ఆ గది తలుపులనే చూస్తున్నాడు. మరునాడు... ఉదయం ఏడు గంటల వేళ... నిద్ర లేచిన బాలూ.. తనకి బోర్నవిటా తెచ్చిన తల్లిని కోపంగా, తిరస్కారంగా చూస్తూ అరిచాడు.

'రాత్రి నన్ను ఈ గదిలో ఒంటరిగా వదిలేసి, నువ్వు నాన్న ఆ గదిలోకి ఎందుకు వెళ్ళారు?'

బాలూ అలా అడుగుతాడని కాని, అడగగలడని కాని వూహించని మమత నిరుత్తరురాలైంది. మరుక్షణం ఆమె ముఖం రక్తం చిందేంత ఎర్రగా కందిపోయింది.

'చెప్పమ్మా! రాత్రే కాదు. చాలా రాత్రులుగా మధ్య



రాత్రి నువ్వు నన్ను ఒంటరిగా వదిలేస్తున్నావు! ఇంత జ్వరంతో నేను ఉంటే.. నన్ను వదిలి....' వాడి పెదవులు దుఃఖోద్వేగంతో వణికి పోతున్నాయి.

మమత అక్కడనుంచి పరుగు లాంటి నడకతో కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

పాలిపోయిన ముఖంతో కాస్త దూరంలో నిలబడి ఉన్న తండ్రిని చూస్తూ ఆగ్రహంగా అడిగాడు బాలూ 'నువ్వయినా చెప్పు నాన్నా! నన్ను ఒక్కడినే ఈ గదిలో వదిలేసి నువ్వు, అమ్మ ఆ గదిలోకి ఎందుకు వెళ్ళారు?'

సారధి బాలూ తల నిమురుతూ లాలనగా అడిగాడు.

'మందు వేసుకున్నావా, నాన్నా?'

తండ్రి తనడిగిన దానికి సమాధానం ఇవ్వకుండా మాట మార్చడంతో బాలూకి ఉక్రోషంతో దుఃఖం వచ్చింది. 'ఈ వెధవ జ్వరంతో తనిలా మంచాన పడి వుండబట్టి గానీ, లేకపోతే హాయిగా చదువుకుంటూ, ఫ్రెండ్స్‌తో ఆడుకుంటూ ఉండేవాడు ... హఠాత్తుగా వాడికి తన తండ్రిపై ఉన్న కోపం స్థానంలో తన స్థితిపై తనకే జాలి కలిగింది. 'నాకు చదువుకోవాలని ఉంది. నేను స్కూలుకి వెళ్తాను నాన్నా! నాకు ఇంట్లో ఏమీ తోచడం లేదు' వెక్కిళ్ళ మధ్య అన్నాడు బాలూ.

'పోనీ, నేను ఆఫీసుకి సెలవు పెట్టనా? మనిద్దరం చెస్ ఆడుకుందాం...'

'నాకు చదువుకోవాలని ఉంది. మీతో ఆడుకోవాలని లేదు... ' పళ్ళ బిగువున అరిచాడు బాలూ. 'చక్రధర్, హరీష్ వీళ్ళెవరూ మనింటికి రావడం లేదు. నాకెవరూ ఫ్రెండ్స్ లేరు. కనీసం నాకొక చెల్లి ఉన్నా బాగుండేది. చక్కగా నాతో ఆడుకునేది!' నిస్సహాయంగా వుంది వాడి స్వరం.

'నీకు నేను, అమ్మ వున్నాంగా బాలూ!' ఓదార్పుగా అన్నాడు సారధి.

'మీరా!' నిరసనగా నవ్వేడు బాలూ. 'మధ్యరాత్రి వచ్చి మెళకువ వచ్చి చూస్తే, అమ్మ నువ్వు నా దగ్గర ఉండరు. నాకెంత భయం వేస్తుందో తెలుసా?'

సారధి జాలిగా, అసహాయంగా నిట్టూర్చాడు. మమత, సారధి ఆ రాత్రి బాలూ దగ్గరే పడుకున్నారు. తల్లికి, తండ్రికి మధ్య పడుకుని వున్న వాడిలో ఏదో భద్రతాభావం.

రోజులు వారాలుగా, వారాలు నెలలుగా మారి కాలచక్రంలో కరిగిపోతున్నాయి. తల్లిలో ఏదో మార్పు కన్పిస్తోంది. కాని, ఆ మార్పు ఏమిటో వాడి ఊహకి అందలేదు.

ఆ రోజు ... మమత కడుపులో నెప్పితో మెలికలు తిరుగుతుంటే సారధి ప్రక్కింటి వాళ్ళని బాలూని చూస్తుండమని భార్యని తీసుకుని హాస్పటల్‌కి వెళ్ళాడు.

గంట తర్వాత ఇంటికి వచ్చిన తండ్రిని చూసి బాలూ అదుర్దాగా అడిగాడు.

'అమ్మకేమయింది నాన్నా? అమ్మ ఎలా ఉంది?'

తండ్రి చెప్పిన మాటలు విన్న బాలూ కళ్ళు కాంతివంతమయ్యాయి.

హాస్పటల్‌లో తల్లి బెడ్ ప్రక్కనే క్రెడిల్‌లో అప్పుడే పుట్టిన పసికందుని చూసేటప్పటికి బాలూ కళ్ళలో ఛమక్‌మనే కాంతి ఎగిరి వచ్చింది.

'అమ్మా! చెల్లి బాగుంది కదూ?' పొగాకు కాడల్లాంటి తన బలహీనమైన చేతులతో పాప బుగ్గలు నిమురుతూ అడిగాడు.

'నేను చెల్లితో ఆడుకుంటాను నాన్నా!' వాడి స్వరంలో ఎనలేని సంతోషం! అవధులు దాటిన ఆనందం! 'చెల్లి ఇంకా చిన్నదిరా... అది పెద్దయ్యాక..' సారధి స్వరంలో ఏదో అడ్డు పడ్డట్టయింది. 'చెల్లి భలే ముద్దొస్తోంది కదమ్మా!' బాలూకి పాపని వర్ణించడానికి మాటలే దొరకడం లేదు.

మమత పాపని చూడడం లేదు.కాంతివంతమయిన కొడుకు కళ్ళలోని వర్ణనాతీతమైన ఆనందాన్ని సజల నయనాలతో చూస్తోంది.

పన్నెండు నెలల క్రిదట బాలూకి లుకేమియా అని డాక్టర్లు చెప్పిన తరువాత 'చెల్లి కావాలి' అనే బాలూ కోరికని తీర్చడం కోసం జబ్బుతో వున్న బాలూని ఒంటరిగా వదిలి, భర్తతో సుఖాన్ని పంచుకున్న మమత!

తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఒక్క బిడ్డ చాలు అని బాలూ పుట్టాక ఇంక పిల్లలు వద్దనుకున్న మమత, సారధి, మృత్యువుకు చేరువవుతున్న బాలూ చివరి కోర్కెని తీర్చగలిగారు. ❐